మధు రాముతో, "సరే రాము. నువ్వు చెప్పింది సబబుగానే వుంది. నువ్వన్నట్లుగా మా ట్యుటోరియల్స్‌లో టీచర్లు నీకు సరిగ్గా బోధించలేదని రుజువయితే నువ్వు మాకు చెల్లించిన ఫీజు తిరిగి ఇచ్చేస్తాం. నువ్వు ఒక గంట తరువాత మళ్లీ ఇక్కడకు వస్తే మా టీచర్లు వాళ్ల సబ్జక్టులలో నిన్ను పరీక్ష చేస్తారు" అని అన్నాడు. రాము బయటకు వెళ్లాడు. వెంటనే మధు టీచర్లందరిని పిలిపించాడు.

"రాము అనే విద్యార్థి మన ట్యుటోరియల్స్‌లో మెట్రిక్యులేషన్ చదివానని, మీరు అతనికి బాగా బోధించని కారణంగా తను పరీక్షలో తప్పానని, అందుచేత అతను మన ట్యుటోరియల్స్‌కు చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చి వేయాలని డిమాండ్ చేశాడు" అని మధు అన్నాడు.

"మేమంతా మా సబ్జక్టులను బాగానే టీచ్ చేశాం సార్. మన ట్యుటోరియల్స్‌లో ఫస్టు క్లాసులు చాలా వచ్చాయి. చదవని రాము తప్ప అందరు పాసయ్యారు" అని తమ తప్పు లేదంటూ టీచర్లంతా అన్నారు.

"మీ లోపం లేదని నాకు తెల్సు. మనకు వచ్చిన రిజల్ట్స్ ఆ సంగతిని రుజువు చేశాయి. కానీ మనం ఇప్పుడు చేయవల్సింది ఒక్కటే. రాముని మీరంతా మీమీ సబ్జక్టులలో పరీక్ష చేసి అతను అన్ని సబ్జక్టులలో పాసయినట్లుగా చూపాలి. మీరడిగే ప్రశ్నలలోనే అతనికి సమాధానాలు వుండాలి. ఒక్క ప్రశ్న కూడా అతనికి కష్టంగా వుండకూడదు. ఈ సంగతి ముఖ్యంగా గుర్తు పెట్టుకోండి" అని మధు సలహా ఇస్తూ వాళ్లకి చెప్పాడు.

"సరే సార్" అని అందరూ తలలూపారు.

ఒక గంట తరువాత మళ్లీరాము మధు దగ్గరికి వచ్చాడు. మొదట తెలుగు టీచరు తన పరీక్ష ప్రారంభించాడు.

"తెలుగు వ్యాకరణంలో నామవాచకమంటే ఒక మనిషి పేరు, స్థలంపేరు, వస్తువు పేరు. నీపేరు చెప్పు, రాము" అని టీచరడిగాడు.

"రాము" అని సమాధానం చెప్పాడు రాము.

"సెభాష్! నువ్వు నామవాచకానికి సరియైన ఉదాహరణ చెప్పావు. నువ్వు తెలుగు వ్యాకరణంలో పాసయ్యావు" అని అన్నాడు. తరువాత సైన్స్ టీచరు రాముని ఒక ప్రశ్న అడిగాడు. "ఆర్కిమెడీన్ సూత్రాన్ని ఎవరు కనిపెట్టారు?"

"ఆర్కిమెడీస్" అని సమాధానం చెప్పాడు రాము.

"రైట్..నువ్వు సైన్సులో పాసయ్యావు" అని సైన్సు టీచరు అన్నాడు. ఆ తరువాత సోషల్ స్టడీస్ టీచరు ఒక ప్రశ్న వేశాడు.

"ఢిల్లీ రాజధానిగా గల మన దేశానికి రాజధాని ఏది?"

"ఢిల్లీ" అని రాము బదులు చెప్పాడు.

"కరెక్ట్. నువ్వు సోషల్ స్టడీస్‌లో పాసయ్యావు" అని అన్నాడు సోషల్ స్టడీస్ టీచరు.

అప్పుడు ఇంగ్లీష్ టీచరడిగాడు.

"వాట్ డు యూ వాంట్, రాము?"

"ఐ వాంట్ మై మనీ" అని సమాధానం చెప్పాడు రాము.

"దటీజ్ ది రైటాన్సర్..యుహేవ్ పాస్డ్ ఇంగ్లీష్" అని అన్నాడు ఇంగ్లీష్ టీచరు. చివరికి లెక్కల టీచరు వంతు వచ్చింది. ఆయన మిగిలిన టీచర్లతోను, ప్రిన్సిపాల్ తోను, "నా సబ్జక్టులో కూడా పాసయినప్పుడే రాము మన ట్యుటోరియల్స్‌లో బాగా నేర్చుకున్నట్లు అవుతుంది" అన్నాడు. మిగిలిన టీచర్లు లెక్కల టీచరు మాటల ధోరణికి కొంచెం షాక్ తిన్నారు. తను చెప్పిన సలహాను మరిచిపోయి ఆయన లెక్కల సబ్జక్టులో కష్టమైన ప్రశ్న అడుగుతాడని మధు కంగారుపడుతున్నాడు. లెక్కల టీచరు రాముని సీరియస్‌గా అడిగాడు. "రాము, నీకు ఈ ట్యుటోరియల్స్ నుంచి ఎంత డబ్బు తిరిగి రావాలి?" మధు, మిగిలిన టీచర్లు ఆ ప్రశ్నను విని లెక్కల టీచరు రాముకి అతను కట్టిన ఫీజంతా తిరిగి ఇప్పించేస్తాడేమోనని భయపడిపోతున్నారు. రాము సమాధానం చెప్పాడు. "నెలకు నూట యాభై రూపాయల వంతున ఎనిమిది నెలలకు పన్నెండు వందల రూపాయల ఫీజు, ప్రారంభంలో కట్టిన ఎడ్మిషన్ ఫీజు మూడు వందల రూపాయలు, కలిపి మొత్తం నాకు పదిహేను వందల రూపాయలు తిరిగి వస్తుంది" తనకు డబ్బు తిరిగి వస్తుందనే సంతోషంతో రాము వివరంగా సమాధానం ఇచ్చాడు. అప్పుడు లెక్కల టీచరు "రాము, ఇప్పుడు నేనడిగిన ప్రశ్న లెక్కల సబ్జక్టుకు సంబంధించినది. దానికి నువ్వు కరెక్ట్‌గా లెక్క కట్టి సమాధానం చెప్పావు. నువ్వు నా సబ్జక్ట్‌లో కూడా పాసయ్యావు" అని ముగించాడు. మధు అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు. మిగిలిన టీచర్లు, మధు లెక్కల టీచర్ తెలివితేటలకు ఆయనను తమ మనసులలోనే అభినందించారు. మధు, రాముతో "ఇక్కడ నువ్వు నేర్చుకున్న అయిదు సబ్జక్టులలోను నువ్వు పాసయ్యావు. అందుచేత నీకు మేము నువ్వు చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వవల్సిన అవసరం లేదు" అని చెప్పాడు. పాపం! తెలివి తక్కువ రాము తెల్లమొహం వేసి ఇంటి ముఖం పట్టాడు. అప్పుడు టీచర్లందరు మధుతో "రాము మా క్లాసులకు రెగ్యులర్‌గా హాజరు కాలేదు, కష్టపడి చదవలేదు" అని అన్నారు. మధువాళ్లతో "అందుచేతనే రాముని తగిన ప్రశ్నలడిగి పాసయ్యాడని, మన దగ్గర సబ్జక్టులన్నీ నేర్చుకున్నాడని చెప్పాం" అన్నాడు.

-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి (హైదరాబాద్)

***

# వైరాగ్యం

రమ్య రవిలది ఓ అపురూపమైన జంట. వారి పెళ్ళయి రెండేళ్ళు కావొస్తోంది. రమ్యకు ఇప్పుడు తొమ్మిదో నెల. భార్య నెల తప్పిననాటి నుండి ఆమెను మరింత అపురూపంగా చూసుకుంటున్నాడు రవి. రమ్య అత్తమామలు ఆమెని కన్నకూతురిలా చూసుకుంటున్నారు.

ఓరోజు ఆఫీసు పని మూలాన రవి హఠాత్తుగా కేంప్‌కి వెళ్ళాల్సి వచ్చింది. భార్యని ఆ పరిస్థితుల్లో వదల్లేక వదల్లేక బయల్దేరాడు. తను కేంప్ కెళ్ళేముందు ఫేమిలీ డాక్టర్‌కి తన భార్య గురించి ఆందోళన వ్యక్త పరిచాడు. రవి ఆమె సెన్సిటివ్‌నెస్‌ని డాక్టర్‌కి గుర్తు చేశాడు. ఆమె ఈ ప్రసవ వేదన భరించలేదేమోనని అతని భయం. 'రమ్యకు ఏదైనా ప్రమాదం జరిగితే' రవి ఊహించలేకపోయాడు. రమ్య లేనిదే రవి లేడు.

* * *

వెన్నులో నొప్పితో ఫెళ్ళు మని, చరచినట్లె మెలకువ వొచ్చింది రమ్యకు. కడుపులోని ప్రాణి బయటకు వచ్చే ప్రయత్నమదని అర్థమై నిలువెల్లా వణికిపోయిందామె.

క్షణాల్లో హాస్పటల్లో చేర్చబడింది రమ్య.

అప్పుడన్పించింది రమ్యకు.

భరించలేని బాధ మెలితిప్పుతోందామెను. పళ్ళ బిగువ నదిమి పెట్టింది అంతటి బాధనూ. అప్పుడన్పించింది రమ్యకు.

ఇంత వేదననోర్చి, మృత్యుముఖంలో అడుగిడే క్షణాన, తనాజీవిని ఎలా క్షమిస్తుంది...ఎందుకీ ఆప్యాయతలు, మమకారాలు?

తిరిగి జీవించటం అనేది అసలుందా? ఎంత పిచ్చిదై నవమాసాలు మోసిందీ 'రాక్షసుణ్ణి'.

తీయని మాటలతో, బలహీన క్షణాన తనని వశపర్చుకున్న భర్తది కదూ ఈ నేరం! ఈ వేదనలో వెయ్యోవంతైనా ఆయన అనుభవించగలడా?

భగవాన్! మళ్ళీ బ్రతకటం అనేది జరిగితే తన ఈ వేదనకు కారకులైన వార్ని, వేధిస్తున్న వార్ని కన్నెత్తి కూడా చూడగూడదు'

విల విల లాడింది రమ్య.

* * *

కేంప్ నుండి వచ్చిన రవికి తియ్యని వార్త అందింది. తన భార్య క్షేమంగా వుందని, తనకోముద్దుల బిడ్డనిచ్చిందని. భార్యాబిడ్డల్ని ఆనందంగా చూసుకున్నాడు.

బోసినవ్వుల బాబును, హృదయానికి హత్తుకుని ముద్దాడి, ఊయలలో వేసింది రమ్య.

ఎంత వేదన పడి సంపాదించుకున్నదీ ముద్దుల మూటను. ఒక్కక్షణం ఆ పసివాణ్ణి చూసి, గర్వంతో లయ తప్పిందామె హృదయం.

ఇంతటి తీయని వరాన్ని ప్రసాదించిన తన 'పతిదేవుని' కౌగిలిలో ఒదిగిపోతూ-అనుకుంది రమ్య. "భగవాన్! మరో జన్మంటూ వుంటే-ఇటువంటి బిడ్డను, భర్తను ప్రసాదించు".

-బి.పాండురంగారెడ్డి (కరీంనగర్)